RNI:TS-28-0030298

తెలంగాణ డైలీ న్యూస్

ప్రజల గుండె చప్పుడు

తెలుగు దినపత్రిక

telanganadailynews.in

epaper.tgdailynews.com

సంపుటి : 01 సంచిక : 259 బుధవారం, అక్టోబర్ 07, 2026 , పేజీలు - 06 వెల : 3/-

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రా వ్యాప్తంగా వెలువడుతున్న తెలంగాణ డైలి న్యూస్ జాతీయ దినపత్రికలో, బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను. కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

9553111142

తెలంగాణలో కరవు పరిస్థితులు

320 మండలాల్లో తీవ్ర దుర్భిక్షం

- తెలంగాణలో 320 మండలాల్లో తీవ్ర కరవు పరిస్థితులు
- ఎల్ నినో ప్రభావంతోనే ఈ పరిస్థితి అని ప్రాథమిక అంచనా
- సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు సీఎస్ ఆదేశం
- కరవుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం



హైదరాబాద్ :ఎల్ నినో ప్రభావంతో తెలంగాణలో కరవు తీవ్రత ఆందోళ నకరంగా మారింది. ప్రాథమిక అంచనాల ప్రకారం, రాష్ట్రంలోని 18 జిల్లాల్లో గల 320 మండలాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 621 మండలాలు ఉండగా, అందులో సగానికి పైగా మండలాలు కరవు కోరల్లో చిక్కుకున్నట్లు స్పష్టమవుతోంది.ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులపై తక్షణమే సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జజూ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రణాళిక, రెవెన్యూ, భూగర్భ జల, వ్యవసాయం, పంచాయతీ రాజ్ వంటి వివిధ శాఖల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి, నిబంధనల ప్రకారం కరవు మండలాలను గుర్తించాలని సూచించారు. నైరుతి రుతుపవనాల (జూన్–సెప్టెంబర్) వర్షపాతంతో పాటు 12 ప్రామాణికాంశాలను పరిగణనలోకి తీసుకుని అక్టోబర్ చివరి నాటికి నివేదికను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఎల్ నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించినందున, దీనికి అవసరమైన సమగ్ర సమాచారంతో మరో నివేదికను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. కరవు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. త్వరలో మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి, ప్రభావిత మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్రానికి తగిన ఆర్థిక సాయం అందించాలని కోరనుంది.ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణలో 17 శాతం వర్షపాతం లోటు నమోదైంది. గతంలో సుమారు 235 మండలాల్లో కరవు పరిస్థితులు ఉండవచ్చని అంచనా వేయగా, తాజా అంచనాల్లో ప్రకారం ఆ సంఖ్య 320కి పెరిగింది.

ఎర్రవల్లి భూముల లెక్కలు తేల్చండి.

అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు



భూమి సరిహద్దులో ఉన్న మా జీ ముఖ్యమంత్రి

సిద్దిపేట జిల్లా, అక్టోబరు 6 : సిద్దిపేట జిల్లా మర్కూక్ మం డలం ఎర్రవల్లి, శివారు వెంకటా పురం గ్రామాల భూ ముల అంశంపై ముఖ్యమం త్రి రేవం త్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండు గ్రామా ల్లో సర్వే వివరాలను సీఎంకు అధికారులు తెలిపారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలో సర్వే నంబర్ – 325లో మొత్తం 388 ఎకరాల భూమి ఉందని అధికారులు తెలిపారు. రెవెన్యూ అధికారుల సర్వేలో 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. సర్వే నంబర్‌లో 45 ఎకరాల భూమి కనిపించలేదని అధికారులు చెప్పుకొచ్చా రు. ఆ 45 ఎకరాలు ఎక్కడుందో తేల్చాలని అధికారులను సీఎం ఆదేశించారు.ఆ భూమి గుర్తింపు కోసం ఎర్రవల్లి, శివారు వెం కటాపురం గ్రామాల్లో సర్వే నోటిఫికేషన్ విడు దల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆ కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు రెవెన్యూ రికార్డులు సబ్‌మిట్ చేయాలని నోటీసులు అధికారులు జారీ చేయనున్నారు. సర్వే నంబర్ – 325లో ఉన్న భూమిని స్థానిక అర్హులైన రైతులకు ప్రభుత్వం పంపిణీ చేయనున్నారు. సర్వే నంబర్ – 325లో తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మాణం చేయాలని సీఎం ఆదేశించారు.

మోదీ, షా, సీఈసీ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేశారు

వారు చేసింది దేశద్రోహమే



న్యూ ఢిల్లీ :
ప్రధాని మోదీ మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేశారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ నలుగురూ కలిసి దేశానికి వ్యతిరేకంగా 'ఓటు చోరీ' కుట్రకు పాల్పడ్డారని, ఇది ముమ్మాటికీ 'దేశద్రోహం' అని స్పష్టం చేశారు. భవిష్యత్తులో వీరిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం తథ్యమని హెచ్చరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ లో ఎన్నికల సంఘం తీరుకు నిరసనగా మంగళవారం ఇండియా కూటమి ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు కదం తొక్కారు. పార్లమెంట్ భవనం నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దాదాపు 300 మంది ఎంపీలు ర్యాలీగా వెళ్లారు. అయితే ఆకాశ్ వాణి భవన్, నీతి ఆయోగ్ కార్యాలయాల సమీపంలో భద్రతా సిబ్బంది రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఇతర ఎంపీలను అడ్డుకోవడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

హైదరాబాద్ కేబీఆర్ చుట్టూ

స్టీల్ ఫ్లైఓవర్లు.

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, అక్టోబరు 6 : హైదరాబాద్ కేబీఆర్ చుట్టూరా నిర్మించనున్న స్టీల్ ఫ్లైఓవర్లపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జూబ్లీ హిల్స్ ముష్ఠకం జా ఇంజినీరింగ్ కాలేజ్ ఫ్లైఓవర్ పనులను మేఘా ఇంజినీరింగ్‌కు అప్పగించింది. బంజారాహిల్స్, జంక్షన్ పనులపై పాత ఆర్డర్లను రద్దు చేసింది. కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు గతంలో ఇచ్చిన పనుల ఉత్తర్వులను రద్దు చేసింది. ప్యాకేజీ-1లో పనుల పరిధిలో భారీ మార్పులు చేపట్టిం ది. రూ.580 కోట్ల ప్రాజెక్టు వ్యయాన్ని రూ.365.85 కోట్లకు సవరించింది.ప్యాకేజీ-2 పనుల పరిధి, ప్రాంతంలోనూ తెలంగాణ సర్కార్ మార్పులు చేసింది. రూ.510 కోట్లకు బదులుగా రూ.349.31 కోట్లకు సవరిం చింది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముష్ఠ కం జా ఇంజినీరింగ్ కాలేజ్ వరకు కొత్త ఫ్లైఓవర్‌ను డిజైన్ చేసింది. మార్పులు చేసిన ప్రతిపాదనలను జ్యూజ కమిటీ-×××ముందు పెట్టేందుకు అనుమతి ఇచ్చింది. ఫ్లైఓవర్ల పనులపై జీహెచ్ఎంసీ చర్యలకు ప్రభుత్వం ర్యాటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు జీవో ఆర్టీ నంబర్ -927ను తెలంగాణ ప్రభుత్వం జారీ చేసింది.

ఇందిరమ్మ టవర్స్ కాంట్రాక్టర్లకు

ప్రత్యేక ప్రోత్సాహకాలు

- ఆన్‌లైన్‌లో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక..
- పేదల సొంతింటి కలను కార్యరూపంలోకి తెస్తున్నాం..



హైదరాబాద్, అక్టోబరు 6 : సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు ఇం దిరమ్మ టవర్స్ నిర్మాణం చేపట్టామని మం త్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశా రు. (మంగళవారం) హైదరాబాద్ కుత్బు ల్లా పూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లా డారు. ఏడాదిలోపే వీటిని పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు ఇస్తామని తెలిపా రు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం వేగవం తం చేసే కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సా హకాలు ఇస్తామని చెప్పుకొచ్చారు. ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ.90 లక్షల ప్రోత్సాహకం అందిస్తామని పేర్కొన్నారు.కుత్బుల్లాపూర్ గాజుల రామారంలో ఇళ్ల కోసం 7 వేల మందికి పైగా దరఖాస్తు చేశారని.. వీరిలో 5,218 మందిని అర్హులుగా గుర్తించామని మంత్రి పొంగులేటి తెలిపారు. బహిరంగ లక్కీ డ్రా ద్వారా 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేశామని స్పష్టం చేశారు. కుత్బుల్లాపూర్‌లో మూడు విడతల్లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేస్తామని వివరించారు. ప్రస్తుతం 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని చెప్పుకొచ్చారు.ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి ఇళ్ల నిర్మాణం చేపడతామని మంత్రి పొంగులేటి అన్నారు. ఈ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. లబ్ధిదారులు నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు. పేదల సొంతింటి కలను కార్యరూపంలోకి తెస్తున్నామని అన్నారు. 23 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ.. నీ కీలుబొమ్మని అదుపులో పెట్టుకో!



హైదరాబాద్: బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్, సీనియర్ నాయకుడు మన్నె క్రిశాంక్‌ను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచు కుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ అవినీతి బాగోతాన్ని ఆధా రాలతో సహా బయ టపెట్టినందుకే కక్షపూరి తంగా క్రిశాంక్‌పై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేశారని మండిపడ్డారు. ఈ వ్యవహారం పై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీని నేరుగా ట్యాగ్ చేస్తూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ పదునైన పదజాలంతో ఘాటు విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీ వైఖరిని ఎండగడుతూ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. "మిస్టర్ రాహు ల్ గాంధీ.. దేశం అంతటా తిరుగుతూ రాజ్యా ంగం గురించి గొప్పగా ప్రబోధాలు చేస్తారు. కానీ తెలంగాణ లో మాత్రం మీ కీలుబొమ్మ రేవంత్ రెడ్డి ద్వారా పూర్తి అప్రజాస్వామిక, అరాచక పాలనను సాగిస్తున్నారు. దేశానికి ప్రధాని కావాలనుకునే వ్యక్తి ఇంత పిరికివాడి లా, దౌర్జన్యకారుడిలా వ్యవహరించడం సిగ్గుచేటు.వీధుల్లో తిరుగుతూ 'ఓటు దొంగ' అంటూ పెద్దపెద్ద నినాదాలు చేసే రాహుల్ గాంధీ.. కుర్చీలో కూర్చోబెట్టారు. ఇక్కడ ఎమ్మెల్యేల ఫిరాయింపులను బాహాటంగా ప్రోత్సహిస్తూ ఖూనీ చేస్తున్నారు.

చంద్రబాబు నివాసానికి పవన్ కల్యాణ్..

స్థానిక ఎన్నికలపై కీలక చర్చ



అమరావతి, అక్టోబర్ 6: ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా పవన్‌కు చంద్రబాబు, మంత్రి లోకేశ్ స్వాగతం పలికారు. చాలా రోజుల తర్వాత ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ముగ్గురూ కలిసి బ్రేక్ ఫాస్ట్ చేస్తూ స్థానిక ఎన్నికలపై చర్చిస్తున్నట్లు సమాచారం. స్థానిక ఎన్నికల నేపథ్యంలో కూటమి పక్షాల మధ్య సమన్వయం, కలిసి పోటీ చేయడం, రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలతో పాటు నియోజకవర్గ స్థాయి కమిటీల నియామకంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. పర్సంటేజ్‌లతో సంబంధం లేకుండా పొత్తులతో ఎవరికి బలమున్న ప్రాంతాలలో వారు పోటీ చేయాలని నేతలు భావిస్తున్నట్లు సమాచారం.గెలుపే ధ్యేయంగా మూడు పక్షాలు పని చేయాలనీ ఇప్పటికే నేతలు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఏ ఒక్క స్థానం కూడా వైసీపీకి దక్కకుండా చేయాలని నేతలు నిర్ణయించారు. ఈ క్రమంలో తొలిదశలో జరిగే నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలపై ఇరువురు నేతల మధ్య ప్రధానంగా చర్చ జరుగనున్నట్లు తెలుస్తోంది.

ప్రజలకు దసరా, దీపావళి కానుక..

పెరగనున్న విద్యుత్ చార్జీలు



హైదరాబాద్:తెలంగాణలో ప్రజల పరిస్థితి దారుణంగా తయారంది. దసరా, దీపావళి పండుగ ముందు ప్రభుత్వం ఏదైనా శుభవార్త చెప్తదేమో అని ఎదురు చూస్తున్న ప్రజలకు పిడుగు లాంటి వార్త తీసుకొచ్చింది ఈ ప్రభుత్వం అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు.ప్రజలపై రూ.5,420 కోట్ల విద్యుత్ భారాన్ని మోపేందుకు ఈ సర్కారు సిద్ధమవుతున్నదని తెలిపారు. కరువు, ఎల్ నినో, పెరిగిన నిత్యావసర ధరలతో బాధపడుతున్న ప్రజల నడ్డి విరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై భారాన్ని మోపొద్దని, తక్షణమే పెంచిన ఛార్జీలను తగ్గించాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని హరీష్ అన్నారు.

జాతీయ ప్రతినిధుల మహాసభకు బయలుదేరిన ఎమ్మార్పీఎస్ ఎంఎస్ఎఫ్ నాయకులు,

దోమ, అక్టోబర్ 07(తెలంగాణ డైలీ న్యూస్) :

వికారాబాద్ జిల్లా దోమ మండలం ఐనాపూర్ గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఎర్ర శ్రీనివాస్, దోమ మండల ఎంఎస్ఎఫ్ అధ్యక్షులు తమ్మని నవీన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న జాతీయ ప్రతినిధుల మహాసభకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు భారీ సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. అక్టోబర్ 6న ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా జరగనున్న ఈ మహాసభకు వెళ్లే ముందు నాయకులు కార్యకర్తలు పరిగి పట్టణ కేంద్రంలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహానేతల ఆశీస్సులు తీసుకున్న అనంతరం ఎర్ర శ్రీనివాస్, తమ్మని నవీన్ వారు మాట్లాడుతూ, ఉస్మానియా యూనివర్సిటీలో జరగబోయే ఈ జాతీయ ప్రతినిధుల మహాసభ మాదిగ జాతి హక్కుల సాధనకు ఎంతో చారిత్రాత్మకమై నదని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి అణగారిన వర్గాలకు రాజ్యాంగ బద్ధమైన ఫలాలు అందే వరకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అలుపెరుగని పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులు, యువకులు, కర్షకులు అంతా ఒక్కతాటిపైకి వచ్చి మహాసభను జాతీయ స్థాయిలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మార్గదర్శకత్వంలో జరుగుతున్న ఈ పోరాటానికి పరిగి గడ్డ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. చదువుతోనే సమాజంలో గొప్ప మార్పు సాధ్యమని, యువత అన్ని రంగాల్లో ముందుకెళ్లి హక్కులను సాధించుకోవాలని సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ జాతీయ మహాసభ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ , పాల్గొన్నారు.

అత్తారింటి వేధింపులతో యువకుడు ఆత్మహత్య..

నవాబుపేట, అక్టోబర్ (తెలంగాణ డైలీ న్యూస్) :

అత్తారింటి వేధింపులు భరించలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన నవాబుపేట మండలంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనకు సంబంధించి మృతుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని యన్మగండ్ల గ్రామానికి చెందిన ఈశ్వర్ (32) అనే యువకుడికి, పోమాల్ గ్రామానికి చెందిన రాజేశ్వరితో వివాహం జరిగింది. వివాహం తర్వాత ఇల్లరికం వెళ్లిన ఈశ్వర్.. అక్కడే డ్రైవర్‌గా పనిచేస్తూ భార్యాపిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ?అయితే, కొంతకాలంగా భార్య రాజేశ్వరి, మామ మల్లయ్య, అత్త అంజమ్మ తన కుమారుడిని తరచూ సూటిపోటి మాటలతో వేధిస్తున్నారని



మృతుడి తల్లి బొగ్గు జంగమ్మ తెలిపారు. కుటుంబంలో నెలకొన్న వ్యక్తిగత విషయాల కారణంగా కుమారుడిని మానసికంగా తీవ్ర క్షోభకు గురిచేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.?ఈ వేధింపులు తట్టుకోలేక ఈశ్వర్ ఒకసారి సొంతూరికి వచ్చేయగా, పెద్దల సమక్షంలో సర్దిచెప్పి తిరిగి పంపించారు. అయినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. తిరిగి తీవ్రంగా వేధించడంతో మనస్తాపం చెందిన ఈశ్వర్ గ్రామ శివారులో తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. తన కుమారుడి మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని తల్లి పోలీసులను కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఒకవైపు చీకటి కోతలు – మరోవైపు కరెంటు బిల్లుల మోతలు

- కేసీఆర్ హయంలో వెలుగులు - రేవంత్ పాలనలో చీకటి..
- ట్రూ-అప్ పేరిట ప్రజల నడ్డి విరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- కరెంటు బిల్లుల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలి.
- కాంగ్రెస్ రాక్షస పాలనపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి

పరిగి, అక్టోబర్ 07 (తెలంగాణ డైలీ న్యూస్) :

తెలంగాణలో విద్యుత్ వినియోగదారులపై రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత భారాన్ని మోపుతోంది. ట్రూ--అప్ పేరిట రాష్ట్ర ప్రజల నుంచి ఏకంగా రూ.5,420.23 కోట్లు వసూలు చేసేందుకు డిస్కంలకు పచ్చజెండా ఊపింది. ఈ దోపిడీ పర్వం రాబోయే నవంబర్ నెల నుండి అధికారికంగా ప్రారంభంకా నుండటంతో సామాన్య ప్రజలు, రైతాంగం, చిన్న వ్యాపారస్తులు ఉలిక్కిపడు తున్నారు. ?2025 నవంబర్ 10వ తేదీన డిస్కంలు దరఖాస్తు చేసుకున్న వెంటనే, ఈఆర్సీ ద్వారా ఈ భారీ పెంపునకు ఆమోదం తెలపడం చూస్తుంటే ప్రభుత్వానికి ప్రజల నష్టాల మీద కంటే వసూళ్ల మీదే ధ్యాస ఉందని స్పష్టమవుతోంది. ఈ నిర్ణయం ప్రకారం టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 29 నెలల పాటు, టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో 26 నెలల పాటు ఈ అదనపు వసూళ్లు కొనసాగుతాయి. నవంబర్ నెలలో యూనిట్‌కు 30 పైసలు, ఆ తర్వాత నుంచి ఏకంగా 50 పైసల చొప్పున అదనంగా వసూలు చేయనున్నారు. ?ఈ ప్రజా వ్యతిరేక నిర్ణయంపై పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం అంధకారంలోకి నెట్టబడిందని, అక్షరాలా ఇది "కరెంటు లేని చీకటి రాజ్యం"గా మారిందని మండిపడ్డారు. గత కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం విద్యుత్ రంగంలో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచింది. 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ ఇచ్చి రైతన్నల కన్నీళ్లు తుడిచాం. ఏనాడు కూడా రైతులకు, వ్యాపారస్తులకు, సామాన్య ప్రజలకు కరెంటు కోతల ఇబ్బందులు రాలేదు, ఎలాంటి అదనపు బిల్లుల భారం వేయలేదు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఎక్కడ చూసినా నిమిషానికి ఒకసారి కరెంటు కోతలతో పరిశ్రమలు, వ్యవసాయ రంగం సర్వనాశనం అయిపోయాయి. ?ఒకవైపు ఎడతెగని కోతలతో మోటార్లు కాలిపోయి రైతులు అల్లాడిపోతుంటే, మరోవైపు ట్రూ-అప్ ఛార్జీల పేరుతో నడ్డి విరిచేలా బిల్లులు పెంచడం దారుణమని ధ్వజమెత్తారు. "ఇది ముమ్మాటికీ రైతులను, సామాన్య ప్రజలను ఆర్థికంగా దెబ్బతీసే కుట్ర. కరెంటు ఇవ్వలేక చేతగాక, ప్రజల జేబులు గుల్ల చేసేందుకు కాంగ్రెస్ నాయకులు రాక్షసానందం పొందుతున్నారు" అని దుయ్యబట్టారు.

– బీఆర్ఎస్ సుపరిపాలన – కాంగ్రెస్ రాక్షస పాలన...

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయ రంగానికి కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించడం ద్వారా రాష్ట్రంలో పచ్చదనం పరిఢవిల్లిందని, ధాన్యాభివృద్ధిలో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచామని గుర్తుచేశారు. రైతులకు రూపాయి ఖర్చు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్లు వేయించి అన్నదాతను రాజుగా చేశామని తెలిపారు. కానీ, నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి రాగానే కరెంటు కోట్లు పునరుద్ధరించి, మళ్లీ పాత రోజులను తెచ్చిందని విమర్శించారు. చేతకాని పాలనతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేయడమే కాకుండా, విద్యుత్ ఛార్జీల రూపంలో ప్రజల రక్తం తాగుతున్నారని మండిపడ్డారు. ఇష్టానుసారంగా పెంచిన కరెంటు బిల్లుల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమం లేవదీసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు విశ్రమించమని కొప్పుల మహేష్ రెడ్డి హెచ్చరించారు.

– ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం..

ప్రజల సంక్షేమం గాలికొదిలేసి, కరెంట్ ఇవ్వ చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అడ్డగోలుగా బిల్లులు పెంచి జేబులు గుల్ల చేయాలని చూస్తోందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించడం జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండి వైఖరిని మార్చుకుని, ఈ ట్రూ-అప్ విద్యుత్ బిల్లుల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలి. ఒకవేళ ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే, గతంలో కేసీఆర్ అందించిన స్వర్ణయుగ పాలనను గుర్తుచేస్తూ రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజలను కలుపుకుని పెద్ద ఎత్తున హోరాహోరీ నిరసనలు, ఉద్యమాలు చేపడతాం.. అని హెచ్చరించారు. ?గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌తో కళకళలాడిన తెలంగాణ నేడు కాంగ్రెస్ పుణ్యమా అని అంధకారంలోకి, అశాంతిలోకి నెట్టబడిందని మహేష్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రజల ఆగ్రహానికి త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత.





దౌల్తాబాద్ అక్టోబర్ 6(ప్రజా అక్షరం) ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు ఆదేశాల మేరకు దౌల్తాబాద్ మండలం గోవిందపూర్ గ్రామానికి చెందిన పెనుకుల పద్మకు రూ.51,000, సూరంపల్లి గ్రామానికి చెందిన చిందం జగన్నాథంకు రూ.28,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారుతున్న నేపథ్యంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి, అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందేలా ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు దేవుడి లావణ్య నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శులు చిక్కుడు స్వామి, స్వామినాథ్, మండల మాజీ అధ్యక్షుడు పోతురాజు కిషన్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పిట్ల మల్లేష్, దుబ్బాక నియోజకవర్గ మన్‌కీ బాత్ కన్వీనర్ ముత్యాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ తాటి సాయి, గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షులు తైల కుమార్, మంగలి నరేష్, కోనాయిపల్లి మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో జోరుగా ప్రచార కార్యక్రమం

సికింద్రాబాద్, అక్టోబర్ 07 (తెలంగాణ డైలీ న్యూస్) :

కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నేడు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంతో పాటు, ప్రయాణికు లతో నిత్యం రద్దీగా ఉండే జూబ్లీ బస్ స్టేషన్, మహాత్మా గాంధీ బస్ స్టేషన్ లలో యూనియన్ నాయకులు ప్రత్యక్ష ప్రచారం చేపట్టారు. అలాగే తార్నాక ఆసుపత్రిని సందర్శించి అక్కడ ఉన్న కార్మికులను, సిబ్బందిని నేరుగా కలుస్తూ వారి సమస్యల గురించి ఆరా తీశారు. ?ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు డి.వి.కె. రావు, అదనపు కార్యదర్శి ప్రేమ్‌నాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోలి రవీందర్ తదితరులు పాల్గొన్నారు. వీరంతా కలిసి ప్రతి ఒక్క కార్మికుడిని నేరుగా కలుస్తూ, యూనియన్ భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. కార్మికుల సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం పోరాడుతుందని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. ?ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ మాట్లాడుతూ... కష్టపడి పనిచేసే ప్రతి కార్మికుడికి తగిన గుర్తింపు, న్యాయమైన హక్కులు దక్కే వరకు మన యూనియన్ విశ్రమించదు. నేడు మనం చేపట్టిన ఈ ప్రచారం ద్వారా కార్మికుల చైతన్యాన్ని మరింత ఇనుమడింపజేస్తున్నాము. కార్మికుల సంక్షేమమే మన ధ్యేయం. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు



మరియు ఆసుపత్రులలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడి సమస్యను మా సమస్యగా భావించి పరిష్కారానికి కృషి చేస్తాము. అన్ని విభాగాల కార్మికులు ఐక్యంగా ఉండి మన హక్కులను సాధించుకోవాలి. ప్రభుత్వం మరియు యాజమాన్యాలు కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నాము. లేనిచో రాబోయే రోజుల్లో కార్మిక లోకం తరఫున మరింత ఉధృతమైన పోరాటాలు చేపడతామని హెచ్చరిస్తున్నమ న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

పిట్టంపల్లి కాంగ్రెస్ గ్రామ శాఖ నూతన కమిటీ ఎన్నిక:



చిట్యాల,అక్టోబర్ 06 (ప్రజా అక్షరం ప్రతినిధి): నల్గొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన కమిటీని పార్టీ కార్యకర్తల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా మేడి విష్ణువర్ధన్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జక్కుల రాజు, నారగోని లింగస్వామి, అందె శేఖర్లను నియమించారు. ప్రధాన కార్యదర్శిగా మెట్టు వెంకటేష్ ను ఎన్నుకు న్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో పార్టీని మరింత బలోపే తం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామంలోని స్థానిక సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా మని పేర్కొన్నారు. నూతన కమిటీ ఎన్నిక పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా రక్తదాన శిబిరం:



చిట్యాల, అక్టోబర్ 6 :

రక్తదానం ప్రాణదానంతో సమానమని రామన్నపేట లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ కేవీ ప్రసాద్ అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్ మలక్‌పేట సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా రక్తదాన, ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో షుగర్, ర్యాండమ్ షుగర్, ఈసీజీ, ఎకో, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అత్యవసర సమయాల్లో రక్తం అందించేందుకు రక్త నిల్వలను పెంచడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ భాస్కర్ రావు, సెక్రటరీ మహమ్మద్ ఉస్మాన్, ట్రెజరర్ నరేందర్ రెడ్డి లు తెలిపారు. అలాగే నేత్రదానంపై విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాటం వెంకటేశం, మాజీ సర్పంచ్ల కందిమళ్ళ శిశుపాల్ రెడ్డి , మర్రి జలందర్ రెడ్డి , ఓర్సు సైదులు, నీలకంఠం లింగస్వామి, ఏర్పుల నర్సింహా, ఆనగంటి నరేష్ , మర్రి హరీష్ , ఏర్పుల వెంకటేష్ , యాదయ్య , ఎదుళ్ళ అజిత్ రెడ్డి , కామినేని దుర్గ కుమార్ , నరేష్ , లవకుమార్ , రాకేష్ , శంకర్ , యాదగిరి , రమేష్ తదితరులు పాల్గొన్నారు.లయన్స్ క్లబ్ ప్రతినిధులు, మాజీ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు..

దోమలో వానరాల విలయం.. పొలాల్లో ప్రళయం, ఇళ్లలో భయం.

- చేతికొచ్చిన పంటను మింగేస్తున్న వానరాలు.. ఆందోళనలో రైతులు..
- నిద్రలేని రాత్రులు గడుపుతున్న దోమ ప్రజలు..
- అధికారులు స్పందించాలని వేడుకుంటున్న ప్రజలు



దోమ, అక్టోబర్ 07 (తెలంగాణ డైలీ న్యూస్) :

కోతుల బెడద రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. గ్రామంలో కోతుల సంఖ్య భారీగా పెరిగిపోవడంతో ప్రజలు క్షణ క్షణం భయంతో బతుకులు ఈడ్చుకుంటున్నారు. ఎటు చూసినా పదుల సంఖ్యలో కోతులు గుంపులుగా తిరుగుతూ గ్రామంలో బీభత్సం సృష్టిస్తున్నాయి. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు కోతుల అల్లకల్లో లంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. ప్రజలు, వికారాబాద్ జిల్లాలోని దోమ మండల కేంద్రంలో వానరాల (కోతుల) బెడద రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. గ్రామంలో ఈ వానరాల సంఖ్య భారీగా పెరిగిపోవడంతో స్థానికులు క్షణక్షణం భయంతో బతుకులు ఈడ్చుకుంటున్నారు. ఎటు చూసినా పదుల సంఖ్యలో వానరాలు గుంపులుగా తిరుగుతూ గ్రామంలో బీభత్సం సృష్టిస్తున్నాయి. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు వీటి అల్లకల్లోలంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టపగలే ఇళ్లలోకి చొరబడుతున్న వానరాలు వంటగదిలోని సామాగ్రిని పూర్తిగా ధ్వంసం చేస్తున్నాయి. ఇంట్లో నిల్వ ఉంచిన కూరగాయలు, బియ్యం, తినుబండారా లను లాక్కెళ్లి పాడుచేస్తున్నాయి. బీరువాలు, అల్మారాల్లోని దుస్తులు, ముఖ్యమైన పత్రాలను చించివేస్తూ తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఇళ్లపైకప్పుల మీద దూకుతూ పెంకులను పగలగొడుతుండటంతో ఇళ్లలోకి నీరు కారే సమస్య ఏర్పడుతోంది. ఒంటరిగా కనిపిస్తున్న చిన్నారులపై, వృద్ధులపై ఈ వానరాల గుంపు ఒక్కసారిగా దాడికి దిగుతోంది. వీటి దాడి భయంతో చిన్న పిల్లలను ఇళ్ల నుంచి బయటకు పంపడానికి తల్లులు హడలిపోతున్నారు.ఇంట్లోకి వచ్చిన వానరాలను తరిమేందుకు ప్రయత్నించిన మహిళలు, వృద్ధులపై అవి ఎదురుదాడి చేస్తున్నాయి. ఇలా వానరాల దాడిలో ఇప్పటికే పలువురు స్థానికులు గాయాలపాలై ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. మరోవైపు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా, అగమ్యగోచరంగా తయారైంది. నెలల తరబడి కష్టపడి సాగు చేసిన చేతికొచ్చిన పంట పొలాలపై ఈ వానరాల మందలు పడుతున్నాయి. మొక్కజొన్న, కంది, కూరగాయలు మరియు ఇతర ఆరుతడి పంటలను పూర్తిగా తొక్కి నాశనం చేస్తున్నాయి. పండించిన పంట కళ్ల ముందే నేలపాలవుతుండటంతో రైతన్నలు కన్నీరుమున్నీరవుతున్నారు. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి సాగు చేస్తే, చివరికి చేతికి ఏమీ మిగలడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల చుట్టూ కాపలా కాసినా వందల సంఖ్యలో వచ్చే వానరాలను అడ్డుకోవడం సాధ్యపడటం లేదంటున్నారు. రాత్రింబవళ్లు చలిలో, ఎండలో పొలాల వద్దే జాగారం చేస్తున్నా ఫలితం లేకుండా పోతోందని వాపోతున్నారు. అడవుల్లో సహజ సిద్ధమైన ఆహారం, తాగునీరు కరవు కావడంతోనే ఇవి జనవాసాల వైపు వస్తున్నాయని తెలుస్తోంది. సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారుల నుండి స్పందన కరవైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే దోమ మండల కేంద్రంలో వ్యవసాయం పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రోజురోజుకూ పెరుగుతున్న వానరాల ఉధృతికి ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ అటవీ శాఖ అధికారులు ఈ సమస్యను తీవ్రంగా పరిగణించాలని కోరుతున్నారు. వెంటనే ప్రత్యేక అధికారులను, అనుభవజ్ఞులైన రెస్క్యూ టీమ్‌లను దోమ మండలానికి పంపాలని వేడుకుంటున్నారు. గ్రామంలో సంచరిస్తున్న వందలాది వానరాలను పట్టి నిర్బంధించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, దట్టమైన అడవుల్లోకి వీటిని విడిచిపెట్టి ప్రజలకు, రైతులకు శాశ్వత విముక్తి కల్పించాలని కోరుతున్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే గుర్తించి తగిన ఆర్థిక సాయం అందించాలని, అధికారులు తక్షణమే స్పందించకపోతే గ్రామ ప్రజలందరం కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

తైక్వాండో పోటీల్లో చిట్యాల గ్రీన్ గ్రోవ్ విద్యార్థుల ప్రతిభ..



చిట్యాల, అక్టోబర్ 6 :

నల్గొండ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ యునైటెడ్ నల్గొండ డిస్ట్రిక్ట్ క్యూరుగీ అండ్ పూమ్సే ఛాంపియన్‌షిప్ పోటీల్లో చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయి పోటీల్లో ఈ పాఠశాల కు చెందిన ఏడుగురు విద్యార్థులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు.

అండర్–14 బాలుర విభాగంలో రాధారపు ప్రణయ్ మణిదీప్ గోల్డ్ మెడల్ సాధించగా, బొక్క శ్రీ విష్ణువర్ధన్, ఇల్లందుల విష్ణేష్ సిల్వర్ మెడల్స్, బొక్క శ్రీ హర్షవర్ధన్ రెడ్డి బ్రాంజ్ మెడల్ సాధించారు. బాలికల విభాగంలో నాలం లోచన అనన్య, జిట్ట మిథిలా సిల్వర్ మెడల్స్, బత్తుల వేదాన్షిత బ్రాంజ్ మెడల్ సాధించారు.ఈ సందర్భంగా విద్యార్థులను చిట్యాల ఎస్సై వెంకట్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్‌రెడ్డి అభినందించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, చిన్నతనం నుంచే తైక్వాండో వంటి ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై జాన్‌రెడ్డి, తైక్వాండో మాస్టర్ పట్టేడ సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు గంగాపురం రాము పాల్గొన్నారు..

మహిళలు, బాలల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత...

- దోమలో ఘనంగా ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం
- సమస్యలను భయపడకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలి..
- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా.



దోమ, 07 అక్టోబర్ (తెలంగాణ డైలీ న్యూస్) :

వికారాబాద్ జిల్లా దోమ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “వికారాబాద్ సురక్ష మిత్ర” కార్యక్రమంలో భాగంగా దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళలు, బాలల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రజలను ఉద్దేశించి పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మహిళలు, బాలల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మహిళలు, బాలికలు తమకు ఎదురయ్యే సమస్యలను భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాలికలకు గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్ మధ్య తేడాను చిన్న వయస్సు నుంచే తెలియజేయాలని, అనుమానాస్పదమైన లేదా అసౌకర్యంగా అనిపించే ప్రవర్తనను వెంటనే నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని చెప్పారు. మహిళలు బాలికలను వేధించడం, ఈవ్‌టీజింగ్ చేయడం, అసభ్యంగా ప్రవర్తించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, షీ టీమ్స్ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు.ప్రస్తుత కాలంలో విద్యార్థులు, యువత సోషల్ మీడియాను బాధ్యతాయు తంగా, జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ, బ్యాంకింగ్ వివరాలు, లొకేషన్ వంటి సున్నితమైన సమాచారాన్ని తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని చెప్పారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు ప్రతి ఒక్కరూ సైబర్ హైజీన్ పాటించాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, సమాజంలో ప్రతి ఒక్కరికీ అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మహిళలు, బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. బాలలపై ఏదైనా వేధింపులు, బాల కార్మికత్వం, బాల్య వివాహం లేదా ఇతర సమస్యలు గుర్తించినప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098ను సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహిళలు, బాలల భద్రత, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగం తదితర అంశాలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి శ్రీనివాస్, సిఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ వసంత్ జాదవ్, పోలీస్ సిబ్బంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేయాలి: గిరిబాబు

చిట్యాల, అక్టోబర్ 6



ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గి, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున వచ్చే యాసంగిలో రైతులు వరికి బదులుగా తక్కువ నీటి అవసరమయ్యే ఆరుతడి పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు సూచించారు. చిట్యాల మండలకేంద్రం లో మంగళవారం విత్తన డీలర్లు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఎఫ్ పి ఓ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.జొన్న, పెసర, మినుము, నువ్వులు, స్వల్పకాలిక కూరగాయలను సాగు చేయాలని సూచించారు. వరి సాగు తప్పనిసరి అయితే నీటి వసతి ఉన్న రైతులు స్వల్పకాలిక సన్న రకాలైన ఖచీవీ–1638, తెలంగాణ సోనా వంటి రకాలను మాత్రమే పరిమితంగా సాగు చేయాలని తెలిపారు. దొడ్డు వరి విత్తనాలను విక్రయించవద్దని డీలర్లకు సూచించారు. ఆరుతడి పంటలకు అవసరమైన విత్తనాలను సింగిల్ విండో, ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచుతామని చెప్పారు.ఈ సమావేశంలో పీఏసీఎస్ వెలిమినేడు చైర్మన్ రఘుమారెడ్డి, ఖీూూ డైరెక్టర్ అవిసెట్టి శంకరయ్య, సీఈవోలు నాగరాజు, హరికృష్ణ, ూూపీూ సభ్యుడు లింగారెడ్డి, ఖీూూ ప్రతినిధి రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు, డీలర్లు, రైతులు పాల్గొన్నారు..

సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

చేర్యాల : కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం చేర్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీవాస్య సందీప్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రసాదించిన స్వతంత్ర ఎన్నికల వ్యవస్థను కాపాడాల్సిన సీఈసీ కేంద్ర బిజెపి ప్రభుత్వానికి కీలుబొమ్మగా పనిచేస్తూ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో ఓటర్ల జాబితాలో అక్రమాలు, ప్రతిపక్ష పార్టీల ఫిర్యాదులపై స్పందించకపోవడం, అధికార పార్టీకి అనుకూలంగా



వ్యవహరించడంపై ప్రజల్లో ఎన్నికల సంఘంపై విశ్వాసం సన్నగిల్లుతోందని ఆయన అన్నారు. దేశంలో ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో నాయకుల లక్షలాది ఓట్లను తొలగించిందని పండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం 2002 సంవత్సరం ప్రమాణికం నిబంధన పెట్టి ఓటర్లను అనేక ఇబ్బందుల పాలు చేశారని అన్నారు. రాజ్యాంగబద్ధ సంస్థ అధిపతిగా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన బాధ్యతను విస్మరించిన జ్ఞానేష్ కుమార్ ను తక్షణమే తొలగించాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, కుడిక్యాల బాల్ మోహన్, నంగి కనకయ్య, పొన్నబోయిన మమత, గూడెపు సుదర్శన్, మనెపల్లి కిష్టయ్య, నంగి సత్తయ్య, గోమారపు నర్సయ్య, సిద్దిరాం భద్రయ్య, బండారి శ్రీనివాస్, చరణ్, రాజు, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల తొలగింపు



హైదరాబాద్ : తెలంగాణలో 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల తొలగింపు నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లు సమర్పించారని నిర్ధారణ కాంట్రాక్టు నుంచి రెగ్యులరైజ్ అయ్యాక వెలుగులోకి బాగోతం మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లపై కొనసాగుతున్న విచారణ ఈ వ్యవహారంపై సీబీ-సీఐడీ విచారణకు జేఏసీ డిమాండ్ తెలంగాణలో నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లను ఇంటర్మీడియట్ విద్యాశాఖ విధుల నుంచి తొలగించింది. వారు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని ధ్రువీకరణ కావడంతో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.వివరాల్లోకి వెళితే, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదట కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేసిన వీరందరినీ 2023లో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. అయితే, వారి విద్యార్హత పత్రాలపై అనుమానాలు రావడంతో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆ సర్టిఫికెట్లను సంబంధిత విశ్వవిద్యాలయాలకు వెరిఫికేషన్ కోసం పంపింది. పరిశీలన అనంతరం ఆ సర్టిఫికెట్లు నకిలీవని యూనివర్సిటీలు తేల్చి చెప్పాయి. దీంతో విద్యాశాఖ సదరు లెక్చరర్లకు షో-కాజ్ నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకున్న తర్వాత సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందిఉద్యోగాలు కోల్పోయిన వారిలో రాజన్న-సిరిసిల్ల జిల్లా నుంచి ఆరుగురు ఉండగా, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల నుంచి ముగ్గురు చొప్పున ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, ఖమ్మం, నిర్మల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి ఇద్దరేసి లెక్చరర్లు ఉన్నారు. మరో ఎనిమిది జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈ జాబితాలో ఉన్నారు.ఇదే తరహా ఆరోపణలపై గతంలో సుమారు 10 మంది లెక్చరర్లను తొలగించినట్లు సమాచారం. ప్రస్తుతం మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లను కూడా వెరిఫికేషన్ కోసం యూనివర్సిటీలకు పంపినట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై సీబీ-సీఐడీ, విజిలెన్స్ విచారణ జరిపించాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) చైర్మన్ డాక్టర్ పి. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో ఈ నకిలీ పత్రాలను పరిశీలించి, ధ్రువీకరించిన అధికారుల పాత్రపై కూడా విచారణ జరపాలని ఆయన కోరారు. మోసం రుజువైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

మద్యం ధరలు పెంచితే తాగడం తక్కువ కాదు.. ఆదాయం పెరుగుతోంది:



హైదరాబాద్, అక్టోబర్ 06:
మద్యం ధరలు పెంచితే తాగడం తక్కువ కాదని.. ఆదాయం పెరుగుతుందని తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కేసీఆర్ హయాంలో మద్యం విక్రయాల ద్వారా రూ.10 వేల నుంచి రూ.36 వేల కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు.ఆ పదేళ్లలో మద్యం విక్రయాల ద్వారా 265 శాతం ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం మద్యం విక్రయాల ద్వారా రూ.40 వేల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.4 వేల కోట్ల ఆదాయం మాత్రమే పెరిగిందని గణాంకాలతో సహా ఆయన వివరించారు.ఇక క్యూర్ అర్బన్ పరిధిలో 40 ఎక్స్‌ట్రా బార్లు వచ్చాయని చెప్పారు. అయితే బార్ షాపుల వాళ్లకు కూడా కాంపిటీషన్ ఉంటుందన్నారు. మిగతా రాష్ట్రాల్లో వలే తెలంగాణలో కూడా ఈ కాంపిటేషన్ ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

గోషామహల్‌లో ముస్లిం ఓట్ల తొలగింపునకు కుట్ర



హైదరాబాద్ : గోషామహల్ నియోజకవర్గంలో ముస్లిం ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి ఉద్దేశపూర్వకంగా తొలగించేందుకు కుట్ర జరుగుతోందని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆరోపణలు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో భాగంగా బల్క్ దరఖాస్తుల ద్వారా ఈ ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు.హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, గోషామహల్‌లోని బూత్ నంబర్ 28, 30, 127లో ముస్లిం ఓటర్ల పేర్లను తొలగించేందుకు ముందుగానే ప్రింట్ చేసిన ఫారం-7 దరఖాస్తులను సమర్పిస్తున్నారని ఆరోపించారు. ఈ ఓటర్లందరి పేర్లు కనీసం 2002 నుంచి జాబితాలో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఒకే వ్యక్తి 122 దరఖాస్తులు ఎలా సమర్పిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ కుట్ర వెనుక బీజేపీ నాయకులు ఉన్నారని ఒవైసీ ఆరోపించారు.బల్క్‌గా, తప్పుడు ఫారం-7 దరఖాస్తులు దాఖలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియను పాత పద్ధతిలోనే జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్ వినియోగదారులపై 'ట్రూ-అప్' ఛార్జీల భారం - వచ్చే నెల నుంచి మరింత పెరగనున్న కరెంట్ బిల్లు



హైదరాబాద్ : తెలంగాణలో విద్యుత్ వినియోగదారుల నుంచి రూ.5,420.23 కోట్ల ట్రూ-అప్ ఛార్జీలను వసూలు చేసుకునేందుకు డిస్కంలకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ) అనుమతినిచ్చింది. ఈ మేరకు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 2022-23లో విద్యుత్ కొనుగోలుకు అదనంగా ఖర్చు చేసిన సొమ్ముకు 2023-24కు సంబంధించి ఏర్పడే రెవెన్యూ లోటును కలిపి ట్రూ-అప్ పేరుతో మొత్తం రూ.7,635.22 కోట్లను వినియోగదారుల నుంచి వసూలుకు అనుమతించాలని కోరుతూ 2025 నవంబర్ 10న ఎస్పీడీసీఎల్, ఎన్?పీడీసీఎల్? డిస్కంలు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలిలో పిటిషన్లు దాఖలు చేశాయి.పిటిషన్లపై బహిరంగ విచారణ చేపట్టిన ఈఆర్‌సీ ఇందులో వ్యవసాయానికి సంబంధించిన రూ.2,214.99 కోట్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచే వసూలు చేసుకోవాలని డిస్కంలకు తెలిపింది. మిగిలిన రూ.5,420.23 కోట్లను వ్యవసాయేతర కనెక్షన్ల వినియోగదారుల నుంచి వసూలు చేసుకోవచ్చని తెలిపింది. కొత్తగా రైతు డిస్కం ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో ఈ పిటిషన్లను కొంతకాలం పెండింగ్ పెట్టాలని ప్రభుత్వం ఈఆర్‌సీకి గత మార్చిలో విజ్ఞప్తి చేసింది. దాంతో వీటిపై ఉత్తర్వులు జారీ చేయకుండా ఈఆర్‌సీ ఆపేసింది. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా తాజాగా మళ్లీ ఈఆర్?సీ ఆదేశాలు జారీ చేసింది.కరెంట్ కొనుగోలుకు వాటికి మించి ఖర్చైనా, రెవెన్యూ రాబడి అంచనాల కంటే తక్కువ వచ్చినా దాని లోటును భర్తీ చేసుకునే ప్రక్రియలో వసూలు చేసుకునే సొమ్మునే ట్రూ-అప్ అని అంటారు. ఇలా 2022-23లో విద్యుత్ కొనుగోలుకు అదనంగా చేసిన ఖర్చును, 2023-24 రెవెన్యూ లోటును కలిపి తెలంగాణలో ట్రూ-అప్ ఛార్జీల పేరుతో డిస్కంలు వసూలు చేస్తాయి. ప్రతి ఆర్థిక సంవత్సరంలో డిస్కంలు ఎంత కరెంటును కొనాలి వినియోగదారుల నుంచి ఎంత రెవెన్యూ (రాబడి) వస్తుందనే అంచనాలను తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి ప్రతి ఏడాది మార్చిలో ఆమోదించి తదుపరి ఉత్తర్వులను జారీ చేస్తుంది.ట్రూ-అప్ ఛార్జీలను వచ్చే నెల నుంచి జారీ చేసే కరెంటు బిల్లుల నుంచే ప్రారంభించాలని డిస్కంలను ఈఆర్?సీ ఆదేశించింది. 2022-23, 2023-24లలో ప్రతి కనెక్షన్‌కు ఎన్ని యూనిట్లు వాడారనేది అంశాన్ని పరిగణలోకి తీసుకుని పరిశీలించి, మొదటి నెల (నవంబరు) బిల్లులో యూనిట్‌కు 30 పైసలు, ఆ తర్వాత నెల నుంచి 50 పైసల చొప్పున ట్రూ అప్? ఛార్జీలు వసూలు చేయాలని స్పష్టం చేసింది. ఎస్పీడీసీఎల్ సంస్థ(డిస్కం) పరిధిలోని వినియోగదారుల నుంచి వచ్చే 29 నెలలపాటు ఎన్?పీడీసీఎల్? పరిధిలో రాబోయే 26 నెలలపాటు ఈ ట్రూ అప్? ఛార్జీలు వసూలు చేయాలని సూచించింది.

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు.

హైదరాబాద్ : గాంధీ జయంతి నాడు మాంసం దుకాణాల మూసివేతపై వివాదం ఫిబ్రవరిలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించారని పిటిషనర్ ఆరోపణ కమిషనర్‌పై చర్యలు తీసుకుని, రూ.50,000 జరిమానా విధించాలని అభ్యర్థన గాంధీ జయంతి సందర్భంగా నగరంలో మాంసం దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు తెలంగాణ హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఫిబ్రవరిలో కోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా ప్రవర్తించారంటూ దాఖలైన పిటిషన్‌పై నిన్న విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు.తార్నాకకు చెందిన న్యాయ విద్యార్థి వడ్ల శ్రీకాంత్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. గతంలో ఇలాంటి ఉత్తర్వులపై శ్రీకాంత్ కోర్టును ఆశ్రయించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. స్లాటర్‌హౌస్‌లు, మాంసం దుకాణాల



మూసివేతకు సంబంధించిన ఏ ఉత్తర్వులైనా జీహెచ్ఎంసీ చట్టం-1955 నిబంధనలకు అనుగుణంగానే ఉండాలని స్పష్టం చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరించారు.అయితే, ఆ ఉత్తర్వులను పట్టించుకోకుండా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా స్లాటర్‌హౌస్‌లు, రిటైల్ మాంసం, బీఫ్ దుకాణాలను మూసివేయాలని సెప్టెంబర్ 30న జీహెచ్ఎంసీ పత్రికా ప్రకటన విడుదల చేసిందని ఆయన వాదించారు. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం రూపొందించిన నిబంధనలను గెజిట్‌లో ప్రచురించకుండా ఈ నిర్ణయం తీసుకోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. మాంసం దుకాణాల మూసివేత వ్యాపారుల ప్రాథమిక హక్కులను (ఆర్టికల్ 19(1)(స్వ)) ఉల్లంఘిస్తుందని తెలిపారు.కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయనకు రూ.50,000 జరిమానా విధించాలని పిటిషన్‌లో కోరారు. వాదనలు విన్న న్యాయస్థానం, కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వచ్చేనెల 2వ తేదీకి వాయిదా వేసింది.

క్యూర్ ప్రాంతంలో ప్రకటనలకు ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు

హైదరాబాద్, అక్టోబర్ 6: ప్రాంతంలో తాత్కాలిక, హైపర్‌లోకల్ ప్రకటనలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రతి వార్డుకు ఒక అడ్వర్టయిజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్‌ను నియమించనున్నారు. తాత్కాలిక ప్రకటనలకు గరిష్ఠంగా 3 రోజులు మాత్రమే అనుమతి ఇవ్వనున్నారు. అలాగే హైపర్‌లోకల్ ప్రకటనలకు గరిష్ఠంగా 7 రోజులపాటు అనుమతి ఉండనుంది. అనుమతి లేకుండా ఏర్పాటు చేసే యాడ్స్‌ను వెంటనే తొలగించడంతో పాటు జరిమానా విధించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.వబ్లిక్ ప్రాపర్టీ, చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లపై ప్రకటనలు ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం నిషేధించింది. అదేవిధంగా ట్రాఫిక్, పాదచారుల మార్గాలు, సిగ్నల్స్, జబ్బులకు ఆటంకం కలిగించేలా యాడ్స్ పెట్టరాదని ఆదేశించింది. కొత్త మార్గదర్శకాల అమలు బాధ్యతలను జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎమ్ఎమ్‌సీ కమిషనర్లకు తెలంగాణ ప్రభుత్వం అప్పగించింది.

మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం యువత ముందుకు రావాలి: గవర్నర్



మెదక్ జిల్లా, అక్టోబరు 6:
మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం యువత ముందుకు రావాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాపిలుపునిచ్చారు. మెదక్ జిల్లా రామాయంపేటలో గవర్నర్ శుక్లా (మంగళవారం) పర్యటించారు. మెదక్ - సిద్దిపేట నేషనల్ హైవే 765 ణ+ వెంట జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు పాల్గొన్నారు. 45 కిలోమీటర్ల మేర జీడి మొక్కలు చీనా× నాటనుంది.నేషనల్ హైవే 765పై రామాయంపేట నుంచి సిద్దిపేట వరకు జీడీ మొక్కలు నాటే కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం అనుకుంటే ఏదైనా సాధించి తీరుతుందని తెలిపారు. గతంలో గ్రామాల్లో తుపాకుల గర్జనలు ఉండేవని చెప్పుకొచ్చారు. అలాంటి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలకు విముక్తి కల్పించామని వెల్లడించారు. దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. అందరం కలిసికట్టుగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని గవర్నర్ పేర్కొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేస్తూ వివాదాస్పద బ్యానర్లు ఏర్పాటు చేసిన కేసులో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేత, ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను గోపాలపురం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రి వద్ద అభ్యంతరకర రీతిలో బ్యానర్లు ప్రదర్శించారన్న అభియోగంపై ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు.ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం, మెడికవర్ ఆసుపత్రికి సంబంధించి రూ. 13,200 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఆరోపిస్తూ క్రిశాంక్ తన అనుచరులతో కలిసి ఆసుపత్రి వెలుపల బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ఉపయోగిస్తూ, ఆయనకు అభినందనలు తెలుపుతున్నట్లుగా వ్యంగ్యంగా వీటిని రూపొందించారు. దీనిపై కాంగ్రెస్ నాయకుడు మెట్టు సాయి కుమార్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్), సైబర్ క్రైమ్ విభాగాలకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అక్టోబర్ 5న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో క్రిశాంక్, 'వీ= మీడియా తెలంగాణ" ప్రతినిధులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 353(2), 352 కింద కేసులు నమోదయ్యాయి.క్రిశాంక్ ఈ వ్యవహారంపై స్పందిస్తూ, వివాదాస్పద లావాదేవీల ద్వారా నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కుటుంబానికి చెందిన వ్యాపార ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే కేసులో గతంలో బీఆర్ఎస్ నాయకులు సాయికిరణ్, వినీత్‌లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు.క్రిశాంక్ అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి అవినీతిని ప్రశ్నించినందుకే కక్షపూరితంగా క్రిశాంక్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలను నిరంతరం ఎండగడుతూనే ఉంటామని ఆయన సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు.మరోవైపు బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలు కొట్టిపారేశారు. ముఖ్యమంత్రి కుటుంబానికి మెడికవర్ ఆసుపత్రితో ఎటువంటి వ్యాపార సంబంధాలు లేవని తెలంగాణ ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. తాజా అరెస్టు పరిణామాలతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు మరింత ముదిరాయి.

ఒకే రోజు మూడు మ్యాచులు.. ఇండియన్ క్రికెట్ లవర్స్‌కి నాన్ స్టాప్ ఎంటర్టైన్మెంట్



భారత క్రికెట్ అభిమానులకు మంగళవారం (అక్టోబర్ 6) నిజమైన పండుగ రోజే అని చెప్పవచ్చు. ఈ ఒక్క రోజే ఏకంగా మూడు వేర్వేరు భారత జట్లు వేర్వేరు ఫార్మాట్లలో ప్రత్యర్థులతో తలపడనున్నాయి. అందులో టి20, వన్డే, టెస్టు మ్యాచ్‌లు ఉన్నాయి. మన సీనియర్ స్టార్ ప్లేయర్లు, టాలెంటెడ్ యంగ్ క్రికేటర్లు మైదానంలో సత్తా చాటడానికి సిద్ధమయ్యారు.ఇండియా వర్సెస్ వెస్టిండీస్ ు20 సమరంఅత్యంత ఆసక్తికరమైన మ్యాచ్ లక్నోలోని ఏకానా స్టేడియంలో జరగనుంది. శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోని టీమిండియా, వెస్టిండీస్‌తో ఐదు టి20ల సిరీస్‌లో మొదటి పోరుకు సిద్ధమైంది. సాయంత్రం 7 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ లాంటి తుపాకీ హిట్టర్లు జట్టులో ఉన్నందున భారీ సిక్సర్ల వర్షం ఖాయంగా కనిపిస్తోంది.టీ20 కోసం ఇరు జట్లుభారత జట్టు: వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, కుల్దీప్ యాదవ్, రవి బిష్ణోయ్, నితీశ్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్.వెస్టిండీస్ జట్టు: షై హోప్ (వికెట్ కీపర్/కెప్టెన్), కమిల్ పూరన్, ఆమిర్ జాంగూ, షిమ్రోన్ హెట్మెయర్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, రోవ్‌మన్ పావెల్, రోస్టన్ చేజ్, రొమారియో షెఫర్డ్, గుడాకేశ్ మోటి, అకీల్ హొసేన్, షమర్ జోసెఫ్, మాథ్యూ ఫోర్డ్, కీమో పాల్, క్వింటన్ సాంప్సన్, షమర్ స్ప్రింగర్.

ఇండియా ూా వర్సెస్ ఆస్ట్రేలియా ూామరొకవైపు పాండిచ్చేరి వేదికగా ఇండియా ూా, ఆస్ట్రేలియా ూా జట్ల మధ్య మూడు అనధికారిక వన్డేల సిరీస్ మొదలవుతోంది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో బరిలోకి దిగుతున్న భారత ూా జట్టులో రజత్ పటీదార్, దేవదత్ పడిక్కల్, సాయి సుదర్శన్ లాంటి ధనాధన్ బ్యాటర్లు ఉన్నారు. ఈ డే అండ్ నైట్ వన్డే మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు మొదలవుతుంది.ఇరు జట్ల వివరాలభారత్ ఏ జట్టు: ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), రజత్ పాటిదార్, నిశాంత్ సింధు, అర్షిన్ కులకర్ణి, అర్షద్ ఖాన్, గుర్జప్నీత్ సింగ్, యశ్ ఠాకూర్, అనుకుల్ రాయ్, సూర్యాంశ్ షెడ్గే, కుమార్ కుశాగ్ర, విప్రజ్ నిగమ్.

ఆస్ట్రేలియా ఏ జట్టు: మిచెల్ ఓవెన్, సామ్ కాన్‌స్టాస్, జోష్ ఫిలిప్ (వికెట్ కీపర్), నాథన్ మెక్‌స్వీనీ (కెప్టెన్), లియామ్ స్కాట్, నిఖిల్ చౌదరి, జాక్ ఎడ్వర్డ్స్, ఆరోన్ హార్డీ, బెన్ ద్వార్షియస్, మహ్లీ బీర్డ్‌మన్, స్పెన్సర్ జాన్సన్, తన్వీర్ సంఘా, టాడ్ మర్ఫీ, లాచ్లాన్ షా, విల్ సదర్లాండ్.ఇండియా ఖ-19 వర్సెస్ ఆస్ట్రేలియా ఖ-19మూడో మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరుగుతోంది. భారత అండర్-19 జట్టు, ఆస్ట్రేలియా అండర్-19తో రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్ ఆడుతోంది. మొదటి రోజే మన బౌలర్లు కంగారూలను 174 పరుగులకే ఆలౌట్ చేసి అదరగొట్టారు. ఆట ముగిసే సమయానికి భారత్ 38/2 స్కోరు సాధించింది. రెండో రోజు 9:30 గంటలకు ప్రారంభమవుతుంది.

బంగారం ధరల్లో మళ్లీ మార్పు.. 10 గ్రాముల రేటు ఎంతో తెలుసా?



బంగారం ధరల్లో ఊహించని మార్పులు చోటుచేసుకుంటున్నాయి.. బులియన్ మార్కెట్‌లో ఒక్కోసారి ధర పెరిగితే.. మరికొన్ని సార్లు తగ్గుతుంటాయి.. అమెరికా-ఇరాన్ యుద్ధం, రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు.. ఇలా అంతర్జాతీయ పరిస్థితులు మార్కెట్ ధరలపై ప్రభావం చూపుతుంటాయి. కాగా.. ఇటీవల కాస్త తగ్గి ఊరటనిచ్చిన బంగారం ధరలు మళ్లీ పెరిగాయి.. ఆ తర్వాత స్థిరంగా కొనసాగుతున్నాయి. పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ఆధారంగా మంగళవారం అక్టోబర్ 6 ఉదయం 6 గంటల వరకు దేశీయంగా బంగారం, వెండి ధరలు ఈ కింది విధంగా ఉన్నాయి.24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై రూ10 మేర తగ్గి.. రూ.1,49,170 గా ఉంది.22 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర 10 తగ్గి.. రూ.1,36,740 గా ఉంది.వెండి కిలో ధరపై రూ.100 మేర తగ్గి.. రూ.2,34,900 లుగా కొనసాగుతోంది.అయితే.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది. ప్రధాన నగరాల్లో ధరలు..హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,49,170, 22 క్యారెట్ల ధర రూ.1,36,740 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,44,900 ఉంది.విజయవాడలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,49,170 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,36,740 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,44,900 ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,49,320, 22 క్యారెట్ల ధర రూ.1,36,890 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 ఉంది.ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,49,170, 22 క్యారెట్ల ధర రూ.1,36,740 గా ఉంది. వెండి కిలో ధర రూ.234,900 లుగా ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,49,170, 22 క్యారెట్ల ధర రూ.1,36,740 ఉంది. వెండి కిలో ధర రూ.2,44,900 ఉంది.బెంగళూరులో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రా ధర రూ.1,49,170, 22 క్యారెట్ల ధర రూ.1,36,740 ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 లుగా ఉంది.కాగా.. బంగారం, వెండి ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు.. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. అందుకే అన్ని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.

కొడుకుకు వీరేంద్ర సెహ్వాగ్ షాకింగ్ సలహా



భారత క్రికెట్ దిగ్గజం వీరేంద్ర సెహ్వాగ్ తనదైన దూకుడుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఇప్పుడు ఆయన బాటలోనే ఆయన కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ కూడా క్రికెట్ ప్రపంచంలో అడుగుపెట్టి తన సత్తా చాటుతున్నాడు. జూనియర్ క్రికెట్ నుంచి అండర్-19 స్థాయికి ఎదిగిన ఆర్యవీర్, తాజాగా ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన వన్డే సిరీస్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఈ సిరీస్‌లో మొత్తం 109 పరుగులు సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. ముఖ్యంగా 100కు పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసి తన తండ్రిని పోలిన దూకుడును ప్రదర్శించాడు.

తొలిసారిగా అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్న తన కుమారుడికి వీరేంద్ర సెహ్వాగ్ ఒక అత్యంత విలువైన సలహా ఇచ్చారట. మైదానంలో ఆడేటప్పుడు ఎలాంటి ఒత్తిడికి గురికావద్దని, కేవలం స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయాలని సూచించారు. పెద్ద పెద్ద పరుగులు చేయాలనే ఆలోచనను పక్కనపెట్టి, కేవలం తన సహజమైన ఆటను ఆస్వాది ంచాలని చెప్పినట్లు సెహ్వాగ్ ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఒకవేళ నువ్వు కేవలం పరుగుల గురించే ఆలోచిస్తే ఒత్తిడి పెరిగి అనుకున్న విధంగా రాణించలేవని తన కొడుకుతో స్పష్టంగా చెప్పినట్లు ఆయన తెలిపారు. క్రికెటర్లుగా ఎదిగే క్రమంలో క్రీడాకారులు ప్రశంసలతో పాటు విమర్శలను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని సెహ్వాగ్ తన కుమారుడికి నూరిపోశారు. "ప్రజలు నిన్ను ప్రేమిస్తారు, నీపై విమర్శలు గుప్పిస్తారు, చివరికి నిన్ను ద్వేషిస్తారు కూడా. కానీ నువ్వు వాటికి ఎలాంటి స్పందన ఇవ్వాల్సిన అవసరం లేదు" అని సెహ్వాగ్ ఆర్యవీర్‌కు హితవు పలికారు. ఇతరులు నీ గురించి ఏమనుకుంటున్నారనే దానికంటే, నీ ఆటతీరు మెరుగుపరుచుకోవడంపైనే పూర్తి దృష్టి పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఎవరికి నచ్చింది వాళ్ళు మాట్లాడనివ్వాలని, నువ్వు మాత్రం నీ ప్రాక్టీస్, ఆటపైనే శ్రద్ధ పెట్టాలని కొడుకును ప్రోత్సహించారుతండ్రి చెప్పిన మాటలను ఆర్యవీర్ సెహ్వాగ్ ఎంతో సీరియస్‌గా తీసుకుని మైదానంలో అద్భుతంగా రాణించాడని వీరేంద్ర సెహ్వాగ్ సంతోషం వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియాతో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆర్యవీర్ జట్టుకు మంచి ఆరంభాలను అందించాడు. హాఫ్ సెంచరీ చేజారినప్పటికీ చివరి మ్యాచ్‌లో 47 పరుగులతో రాణించి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. తండ్రి ఇచ్చిన మానసిక స్థైర్యం, సలహాలే తన కొడుకును మైదానంలో నిలకడగా ఆడేలా చేస్తున్నాయని సెహ్వాగ్ గర్వంగా తెలిపారు.

20 ఏళ్ల పెట్టుబడి ప్రణాళిక.. దేనికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి..?



భవిష్యత్తు కోసం పెట్టుబడులు పెట్టడం అంటే ప్రతి నెల కొంత మొత్తాన్ని సేవింగ్స్‌లోకి మళ్లించడం మాత్రమే కాదు. ఏ లక్ష్యం కోసం ఎంత డబ్బు అవసరం? ఆ డబ్బు ఎప్పుడు అవసరం? అందుకోసం ఇప్పటి నుంచి ఎంత పెట్టుబడి చేయాలి? అనే విషయాలను ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవడం చాలా ముఖ్యం. 20 ఏళ్ల వంటి దీర్ఘకాలిక ప్రణాళికలో ఈ విధానం మరింత ఉపయోగకరంగా ఉంటుంది. రాబోయే 20 ఏళ్లలో ఎదురయ్యే ప్రధాన ఆర్థిక అవసరాలను ముందుగా రాసుకోవాలి.

భారీ లక్ష్యాలకు ప్రాధాన్యత

20 ఏళ్లకు రూపొందించే పెట్టుబడి ప్రణాళికలో.. ముందుగా భారీ లక్ష్యాలకు ప్రధాన్యత ఇవ్వాలి. ఇల్లు కొనడం, పిల్లల ఉన్నత విద్య, పిల్లల వివాహం, రిటైర్మెంట్ వంటి భారీ లక్ష్యాలను ఇందులో చేర్చాలి. ప్రతి లక్ష్యానికి ఒక నిర్దిష్ట మొత్తాన్ని, దాన్ని సాధించాల్సిన తేదీని నిర్ణయించుకోవాలి.

అన్ని లక్ష్యాల కోసం ఒకే పెట్టుబడి బకెట్‌ను ఉపయోగించడం కంటే ఒక్కో లక్ష్యానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం మంచిది. సాధారణంగా ఏడాదిలోపు అవసరమయ్యే లక్ష్యాలను స్వల్పకాలికంగా, 1--8 ఏళ్ల మధ్య లక్ష్యాలను మధ్యకాలికంగా, 8 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ సమయం ఉన్న లక్ష్యాలను దీర్ఘకాలికంగా పరిగణించవచ్చు.

ద్రవ్యోల్బణాన్ని మర్చిపోవద్దు

ఈ రోజు ఒక లక్ష్యానికి అవసరమయ్యే మొత్తం, 10 లేదా 15 ఏళ్ల తర్వాత అదే మొత్తంగా ఉండకపోవచ్చు. విద్య, ఇల్లు, వైద్యం వంటి ఖర్చులు కాలక్రమంలో పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల భవిష్యత్ లక్ష్యాన్ని లెక్కించేటప్పుడు ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

తక్కువ కాలంలో అవసరమయ్యే డబ్బుకు స్థిరత్వం, లిక్విడిటీకి ప్రాధాన్యత ఇవ్వాలి. మరోవైపు 15--20 ఏళ్ల తర్వాత అవసరమయ్యే డబ్బుకు మార్కెట్ హెచ్చుతగ్గులను తట్టుకునేంత సమయం ఉంటుంది. కాబట్టి పెట్టుబడి ఎంపికలో లక్ష్య కాలవ్యవధి, రిస్క్ తీసుకునే సామర్థ్యం, వ్యక్తిగత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. వివిధ ఆస్తి వర్గాల్లో పెట్టుబడులు విభజించడం ద్వారా రిస్క్‌ను కొంత మేర తగ్గించుకోవచ్చు, అయితే నష్టాల అవకాశాన్ని పూర్తిగా తొలగించలేం.

రిటైర్మెంట్‌కు ప్రత్యేక స్థానం

ఇల్లు, పిల్లల చదువు వంటి సమీప లక్ష్యాల మధ్య రిటైర్మెంట్ కోసం పెట్టుబడిని వాయిదా వేయకూడదు. 20 ఏళ్ల ఆర్థిక ప్రణాళికలో రిటైర్మెంట్ లక్ష్యానికి ముందుగానే స్థానం కల్పించాలి. దీర్ఘకాలిక రిటైర్మెంట్ పొదుపు కోసం కూడా ఒక ఎంపికగా పరిగణించవచ్చు.

ప్రతి ఏడాది ప్రణాళికను సమీక్షించాలి

పెట్టుబడి ఎంత రాబడి ఇచ్చిందనే దానికంటే, అది నిర్దేశించిన ఆర్థిక లక్ష్యానికి చేరువ చేస్తుందా లేదా అనేది ముఖ్యం. కనీసం ఏడాదికి ఒకసారి ప్రణాళికను సమీక్షించాలి. ఆదాయం, ఖర్చులు, కుటుంబ పరిస్థితులు లేదా ఉద్యోగంలో మార్పులు వచ్చినప్పుడు కూడా పెట్టుబడి ప్రణాళికను సవరించాలి.

ఆదాయం పెరిగినప్పుడు పెట్టుబడినీ పెంచాలి

20 ఏళ్ల ప్రణాళికను ప్రారంభించిన మొత్తంతోనే కొనసాగించాల్సిన అవసరం లేదు. ఆదాయం పెరిగే కొద్దీ పెట్టుబడిని కూడా

2031 వరకు కొత్త టోర్నీ లేనట్టే.. ఐసీసీకి షాకిచ్చిన బీసీసీఐ..?



క్రికెట్ క్యాలెండర్‌లో ఇప్పటికే ఉన్న అంతర్జాతీయ టోర్నమెం ట్లతో షెడ్యూల్ నిండిపోయింది. ఈ పరిస్థితుల్లో కొత్త పోటీలకు అవకాశం లేదని భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ స్పష్టం చేసినట్టు సమాచారం. దుబాయ్ లో జరిగిన ఐసీసీ క్రికెట్ ఆపరే షన్స్ వర్క్‌షాప్‌లో ఈ అంశంపై నెలల పాటు చర్చలు జరిగినా, కొత్త టోర్నమెంట్ ప్రతిపాదన లేకుండానే సమావేశం ముగి సింది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆదాయాన్ని పెంచే మార్గాలపై ఐసీసీకి మెకిన్సే అండ్ కంపెనీ వ్యూహాత్మక నివేదిక ఇచ్చినట్టు తెలుస్తోంది. అందులో భాగంగా టీ20 ఫ్రాంచైజీ జట్లతో వరల్డ్ క్లబ్ ఛాంపియన్‌షిప్ నిర్వహించడం, ఖాళీగా ఉన్న షెడ్యూల్ విండోల్లో నాలుగు దేశాల టీ20 టోర్నమెంట్లు ఏర్పాటు చేయడం వంటి ఆలోచనలు పరిశీలనకు వచ్చాయి.ఈ ప్రతిపాదనలకు మూడు ప్రధాన క్రికెట్ బోర్డులు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఆటగాళ్ల బిజీ షెడ్యూల్‌లో కొత్త టోర్నీలకు స్థలం లేదని అవి స్పష్టం చేశాయి. కొత్త పోటీని చేర్చాలంటే వన్డే ప్రపంచకప్, టీ20 ప్రపంచకప్ లేదా చాంపియన్స్ ట్రోఫీ వంటి ప్రస్తుత ప్రధాన టోర్నమెంట్లలో ఏదో ఒకదాన్ని తగ్గించాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. అలాంటి మార్పు సాధ్యం కాదన్న అభిప్రాయం వ్యక్తమైంది.ఇక ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్‌లో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (ూజ)కు సంబంధించి మార్పు వచ్చే అవకాశం ఉంది. వచ్చే ఏడాది నుంచి డబ్ల్యూటీసీని 9 జట్లతో ఉన్న ప్రస్తుత ఫార్మాట్ నుంచి 12 జట్లకు పెంచే ఆలోచన ఉన్నట్టు సమాచారం. ఆఫ్ఘనిస్థాన్, ఐర్లాండ్, జింబాబ్వేలను కూడా టెస్ట్ చాంపియన్‌షిప్ సైకిల్‌లో చేర్చే అవకాశం ఉంది. దీనిపై ఐసీసీ ఇంకా అధికారిక ప్రణాళికను సభ్య బోర్డులకు పంపలేదు.2031 వరకు భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ తమ ద్వైపాక్షిక షెడ్యూళ్లను ఖరారు చేసుకున్నట్టు నివేదిక పేర్కొంది. 2027 ఇంగ్లిష్ సమ్మర్‌లో తదుపరి డబ్ల్యూటీసీ యాషెస్‌తో ప్రారంభం కానుంది. 2028 ఆరంభంలో

దీపావళికి బైక్ కొనాలని ప్లాన్ చేస్తున్నారా? దేశంలో అత్యంత చౌకైన 5 బైక్‌లు ఇవే..!



మీరు తక్కువ బడ్జెట్‌లో ఉండి, ఈ దీపావళి, పండుగ సీజన్‌లో కొత్త మోటార్‌సైకిల్ కొనాలనుకుంటే మార్కెట్‌లో అనేక కాంపాక్ట్ బైక్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటి ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధర సుమారు రూ. 58,000 నుండి మొదలవుతుంది. వీటిలో 100 సిసి నుండి 110 సిసి వరకు ఇంజిన్ సామర్థ్యం గల బైక్‌లు ఉన్నాయి. అలాగే రోజువారీ వాడకానికి వీటి మైలేజ్ కూడా బాగుంటుంది.హీరో హెచ్ఎఫ్ 100: అత్యంత తక్కువ బడ్జెట్‌లో కొత్త బైక్మీరు తక్కువ బడ్జెట్‌లో బైక్ కొనాలనుకుంటే హీరో ఎఫ్ 100 అత్యంత చౌకైన ఎంపికలలో ఒకటి. సెప్టెంబర్ 2026లో ఈ బైక్ ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధర సుమారు 57,719 రూపాయలు. దీనితో ఇది ఈ జాబితాలో అత్యంత తక్కువ ధర కలిగిన బైక్‌గా నిలిచది.ఇంజిన్, ట్రాన్స్‌మిషన్: హీరో ఎఫ్ 100 లో 97.2 ఎఫ ఎయిర్-కూల్డ్, సింగిల్-సిలిండర్ ఇంజన్ ఉంది. ఈ ఇంజన్ సుమారు 8 ూా శక్తిని ఉత్పత్తి చేస్తుంది. కంపెనీ ప్రకారం, ఈ బైక్ సుమారు 65-70 ఎఐజూశ్రీ మైలేజీని ఇస్తుంది. అయితే ఇది పరిస్థితిని బట్టి మారవచ్చు.ఫీచర్స్: ఇందులో 97.2 సిసి ఇంజన్, 4-స్పీడ్ గేర్‌బాక్స్, తక్కువ బరువు, అల్లాయ్ వీల్స్, డ్రమ్ బ్రేకులు, ఇంటిగ్రేటెడ్ బ్రేకింగ్ సిస్టమ్ ఉన్నాయి. ఈ బైక్ రోజువారీ పట్టణ వినియోగానికి బాగుంటుంది.హీరో హెచ్ఎఫ్ డీలక్స్:

ఈ జాబితాలో రెండవ అత్యంత చౌకైన బైక్ హెచ్ఎఫ్ డీలక్స్, దీని ఎక్స్-షోరూమ్ (ఢిల్లీ) ధర రూ. 59,998 నుండి ప్రారంభమవుతుంది. ఎఫ్ డీలక్స్ 97.2 ఎఫ ఎయిర్-కూల్డ్, సింగిల్-సిలిండర్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఈ ఇంజన్ గరిష్టంగా 5.9ఎజె పవర్, 8.05 చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ బైక్‌కు 4-స్పీడ్ గేర్‌బాక్స్ జత చేశారు. హీరో వెబ్‌సైట్ ప్రకారం, ఎఫ్ డీలక్స్ ూా=ూా× మైలేజ్ 68 ఎఐజూశ్రీగా ఉంది.ఇంజిన్, మైలేజీ: ఎఫ్ డీలక్స్ 97.2 ఎఫ ఎయిర్-కూల్డ్, సింగిల్-సిలిండర్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఈ ఇంజన్ గరిష్టంగా 5.9ఎజె పవర్, 8.05 చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ బైక్‌కు 4-స్పీడ్ గేర్‌బాక్స్ జత చేసింది. హీరో వెబ్‌సైట్ ప్రకారం, ఎఫ్ డీలక్స్ మైలేజ్ 68 ఎఐజూశ్రీగా ఉంది.డీలక్స్ కొన్ని వేరియంట్లలో అటో ఐడిల్ స్టాప్-స్టార్ట్ సిస్టమ్ ఉంటుంది. ఇది ట్రాఫిక్‌లో బైక్ ఎక్కువ సేపు నిశ్చలంగా ఉన్నప్పుడు ఇంజిన్‌ను ఆపివేసి, ఇంధనాన్ని ఆదా చేయడానికి సహాయపడుతుంది. ఇది కాకుండా ఇూజుూ ఫ్యూయల్ ఇంజెక్షన్, టెలిస్కోపిక్ ఫ్రంట్ సస్పెన్షన్, వెనుక అడ్జస్టబుల్ షాక్ అబ్జార్బర్, ×డీూ వంటి ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి. ఈ 100 సిసి కంప్యూటర్ బైక్, ఆఫీసుకు, కాలేజీకి లేదా మార్కెట్‌కు రోజూ వెళ్లి రావడానికి ఒక బడ్జెట్ ఆప్షన్.



కల్ట్ బాయ్స్ మళ్లీ వచ్చేస్తున్నారు.

2018లో విడుదలైన యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ 'హుషారు' సినిమా సంచలన విజయం సాధించింది. చిన్న సినిమా ట్యాగ్ తో రిలీజైన బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లనే రాబట్టింది. ఇప్పుడీ సూపర్ హిట్ సినిమాకు సీక్వెల్ కూడా వస్తోంది. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు.కుర్రకారులో సరికొత్త ఉత్సాహాన్ని నింపిన ఐకానిక్ ఫ్రాంచైజీ మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. 2018లో విడుదలై యూత్‌లో మంచి క్రేజ్ సొంతం చేసుకున్న 'హుషారు' చిత్రం ఎంతటి ఘన విజయాన్ని అందుకుందో మనందరికీ తెలుసు. ఆ సక్సెస్ తర్వాత..తాజాగా అందరిలో ఆసక్తిని పెంచుతూ దర్శకుడు శ్రీ హర్ష 'హుషారు 2'ను సీక్వెల్‌ను అధికారికంగా ప్రకటించారు. దీని టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు. టైటిల్ పోస్టర్‌ను గమనిస్తే.. మొదటి భాగంలో ఐదుగురు స్నేహితులు రూపొందించిన కబూమ్ బీరు ఓ ట్రక్కులో ఉంది. ఆ ట్రక్కుకు రెండు వైపులా కొందరు పట్టుకుని బలంగా లాగుతున్నారు. వారికి తాడులా పాము కనిపిస్తోంది. పాము మధ్యలో స్నేహితులు చిక్కుకుని భయపడుతున్నారు. ట్రక్కు కింద తాబేలు ఉంది. కాస్త దూరంలో బంగారు నగలుతో ఉన్న పెట్టె ఉంది. పోస్టర్ వెనుక ఫ్యాక్టరీ ఉంది. పోస్టర్‌ను చూస్తుంటే.. దేవతలు, రాక్షసులు కలిసి అమృత మథనం చేసిన కథ మనకు గుర్తుకు వస్తుంది. ఆ కథకు, ఈ సీక్వెల్‌కు ఉన్న లింకేంటి? అనే విషయం తెలియాలంటే హుషారు 2 సినిమా వచ్చే వరకు ఆగాల్సిందే. 2018లో విడుదలైన యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ 'హుషారు' సినిమా సంచలన విజయం సాధించింది. చిన్న సినిమా ట్యాగ్ తో రిలీజైన బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లనే రాబట్టింది. ఇప్పుడీ సూపర్ హిట్ సినిమాకు సీక్వెల్ కూడా వస్తోంది. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు.రెట్టింపు ఫన్, మ్యాడ్‌నెస్, నాన్‌స్టాప్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో 'హుషారు 2' తెరకెక్కనుంది. ఒరిజినల్ 'హుషారు'ను తెలుగు రాష్ట్రాల ప్రేక్షకుల్లో కల్ట్ హిట్‌గా నిలిపిన ఎనర్జీ, ఎంటర్‌టైన్‌మెంట్‌ను ఈ సీక్వెల్ మరోసారి అందించనుంది.ఒరిజినల్ క్రియేటర్ రిటర్న్స్

2018లో వచ్చిన 'హుషారు' చిత్రానికి కథ రాసి దర్శకత్వం వహించిన డైనమిక్ డైరెక్టర్ శ్రీ హర్ష కోనుగంటి మరోసారి మెగాఫోన్ పట్టుకోనున్నారు. యూత్ కల్చర్, ఆధునిక సంబంధాలు, కామెడీ టైమింగ్‌పై మంచి పట్టున్న శ్రీ హర్ష.. మరింత భారీగా, మరింత కొత్తగా రూపొందనున్న 'హుషారు 2'కు దర్శకత్వం వహించనున్నారు.శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్.. ఏడాది చివర్లో గ్రాండ్ రిలీజ్

సినిమా ప్రధాన షూటింగ్ షెడ్యూల్స్‌ను పూర్తి చేసుకుంది. ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రేక్షకులకు అత్యున్నత స్థాయి సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు చిత్ర యూనిట్ సిద్ధమవుతోంది. ఏడాది చివర్లో సినిమాను గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.ఈ సినిమాలో రాహుల్ రామకృష్ణ, అశోక్ గల్లా, రవి అంథోని, దినేష్ తేజ్, శశిధర్ కోచర్లకోట, విధి యాదవ్, అభిజ్ఞ ఉతులూరు, భగవాన్ తివారి, జతిన్ గోసామి, రజయ్ రోవన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.



సినీ పరిశ్రమలో సెలబ్రిటీలపై సోషల్ మీడియాలో వచ్చే రూమర్లు ఒక్కోసారి తీవ్ర దుమారం రేపుతుంటాయి. తాజాగా టాలీవుడ్, బాలీవుడ్‌లలో అనేక హిట్ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న రకుల్ ప్రీత్ సింగ్ తనపై వస్తున్న తప్పుడు వార్తల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన నివాసాలపై ఐటీ (ఇన్కమ్ టాక్స్) సోదాలు జరిగాయని, అలాగే భారీగా బినామీ ఆస్తులు ఉన్నాయంటూ కొన్ని మీడియా మాధ్యమాలలో ప్రసారమైన కథనాలపై ఆమె తీవ్రంగా స్పందించారు.ఆ వార్తల్లో ఏమాత్రం నిజం లేదని, అవన్నీ పూర్తిగా నిరాధారమైనవని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో సుధీర్ఘ పోస్ట్ చేశారు. ఎలాంటి ప్రాథమిక సమాచారం లేకుండా, కేవలం సంచలనం కోసం కొందరు నిరాధారమైన వార్తలను ప్రచారం చేయడం బాధాకరమని అన్నారు. తన ప్రతిష్టను దిగజార్చేలా, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రసారమవుతున్న ఈ ఫేక్ వార్తలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆమె గట్టిగా డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన జర్నలిజం పేరుతో కొందరు ఇలాంటి తప్పుడు కథనాలు ప్రసారం చేయడం పట్ల ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఆ వార్తల్లో ఏమాత్రం నిజం లేదని, అవన్నీ పూర్తిగా నిరాధారమైనవని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో సుధీర్ఘ పోస్ట్ చేశారు. ఎలాంటి ప్రాథమిక సమాచారం లేకుండా, కేవలం సంచలనం కోసం కొందరు నిరాధారమైన వార్తలను ప్రచారం చేయడం బాధాకరమని అన్నారు. తన ప్రతిష్టను దిగజార్చేలా, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రసారమవుతున్న ఈ ఫేక్ వార్తలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆమె గట్టిగా డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన జర్నలిజం పేరుతో కొందరు ఇలాంటి తప్పుడు కథనాలు ప్రసారం చేయడం పట్ల ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఇలాంటి తప్పుడు వదంతులను ఎవరూ నమ్మవద్దని రకుల్ ప్రీత్ సింగ్ తన అభిమానులకు, శ్రేయోభిలాషులకు విజ్ఞప్తి చేశారు. ఒక సెలబ్రిటీ వ్యక్తిగత జీవితంపై, ఆర్థిక లావాదేవీలపై నిరాధారమైన ఆరోపణలు చేయడం చట్టరీత్యా కూడా నేరమని, భవిష్యత్తులో ఇలాంటి తప్పుడు వార్తలు ప్రసారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.ఇలాంటి తప్పుడు వదంతులను ఎవరూ నమ్మవద్దని రకుల్ ప్రీత్ సింగ్ తన అభిమానులకు, శ్రేయోభిలాషులకు విజ్ఞప్తి చేశారు. ఒక సెలబ్రిటీ వ్యక్తిగత జీవితంపై, ఆర్థిక లావాదేవీలపై నిరాధారమైన ఆరోపణలు చేయడం చట్టరీత్యా కూడా నేరమని, భవిష్యత్తులో ఇలాంటి తప్పుడు వార్తలు ప్రసారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

నాకు ఎలాంటి బినామీ ఆస్తులు లేవు.

ఇట్స్ అఫీషియల్.. ఓటీటీలో సూరి- సుహాస్‌ల 150 కోట్ల బ్లాక్ బస్టర్ మూవీ..



తమిళ నటుడు సూరి, టాలీవుడ్ వర్సటైల్ యాక్టర్ సుహాస్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన సినిమా 'మండాడి'. జాతీయ అవార్డు గ్రహీత దర్శకుడు వెట్రిమారన్ నిర్మించిన ఈ సినిమాకు మదిమారన్ పుగళేంది దర్శకత్వం వహించారు. రిలీజ్ కు ముందే ఈ సినిమా నుంచి వచ్చిన కంటెంట్ ఆడియెన్స్ లో ఇంట్రెస్ట్ క్రియేట్ చేసింది. టీజర్స్, పోస్టర్స్, ట్రైలర్స్ కూడా ఆడియెన్స్ ను బాగానే ఆకట్టుకున్నాయి. అందుకు తగ్గట్టుగానే సెప్టెంబర్ 10న రిలీజైన మండాడి సినిమాకు మొదటి షో నుంచే సూపర్ హిట్ టాక్ వచ్చింది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ తో తెరకెక్కిన ఈ సినిమాలో సముద్రంలో సాగే పడవల పోటీలు, సుహాస్- సూరిల నటన, యాక్షన్ ఎలిమెంట్స్ ఆడియెన్స్ కు సరికొత్త థ్రిల్ అందించాయి. అందుకే పోటీగా కార్తీ సర్దార్ 2 సినిమా రిలీజైనా మండాడి సినిమాకే మంచి కలెక్షన్లు వచ్చాయి. తమిళంతో పాటు తెలుగులోనూ మండాడి మూవీకి రికార్డు కలెక్షన్లు వచ్చాయి. ఓవరాల్ గా ఈ సినిమాకు రూ. 150 కోట్లకు పైగానే కలెక్షన్లు వచ్చినట్లు ట్రేడ్ నిపుణులు చెబుతున్నారు. థియేటర్లలో బ్లాక్ బస్టర్ గా నిలిచిన మండాడి సినిమా ఇప్పుడు ఓటీటీలోకి రానుంది. ఈ మేరకు అధికారిక ప్రకటన కూడా వచ్చేసింది.

'మండాడి' సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. ఈ గురువారం(అక్టోబర్ 08) నుంచి ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఓటీటీ స్ట్రీమింగ్ కు రానుంది. ఈ విషయాన్ని నెట్ ఫ్లిక్స్ అధికారికంగా ప్రకటించింది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లోనూ మండాడి స్ట్రీమింగ్ కానుంది. ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ పతాకంపై ఎల్రెడ్ కుమార్ మండాడి చిత్రాన్ని నిర్మించారు. మహిమా నంబియార్, సత్యరాజ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో మెరిసారు. ఈ సినిమాకు జీవీ ప్రకాశ్ కుమార్ అందించిన సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. మరి థియేటర్లలో మండాడి సినిమాను మిస్ అయ్యారా? అయితే ఎంచెక్కా ఓటీటీలో

బిగ్‌బాస్ ఐదో వారం నామినేషన్స్‌లో ఏడుగురు కంటెస్టెంట్స్.



. డేంజర్ జోన్‌లో ఉన్నది ఎవరంటే?

బిగ్ బాస్ తెలుగు 10వ సీజన్ హోరాహోరీగా సాగుతోంది. సెప్టెంబర్ 07న ప్రారంభమైన ఈ రియాలిటీ షో ఇప్పటికే సక్సెస్ ఫుల్ గా నాలుగు వారాలు పూర్తి చేసుకుంది. ఇప్పుడు ఐదో వారంలోకి అడుగు పెట్టింది. మొదటి వారం చైత్ర ఎలిమినేట్ కాగా రెండో వారంలో కృష్ణుడు బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఇక మూడో వారం ఎలాంటి ఎలిమినేషన్ జరగలేదు. అయితే నాలుగో వారం అనూహ్యంగా సృష్టి వ్యాకరణం బిగ్ బాస్ నుంచి ఎలిమినేట్ అయ్యింది. ఇక సోమవారం అంటేనే బిగ్ బాస్ లో నామినేషన్ల రచ్చ ఉంటుంది. అయిదో వారం నామినేషన్ ప్రక్రియ కూడా రసవత్తరంగా సాగిందని తెలుస్తోంది. కంటెస్టెంట్ల ఒకరి తప్పులను మరొకరు చెప్తూ, మాటల యుద్ధానికి దిగారు. త్రిగుణ్, అపూర్వ, రోహిత్, ముఖేష్, వర్షిణి మధ్య ఎక్కువగా సంభాషణలు జరిగినట్టు ప్రోమోలు చూస్తే అనిపిస్తోంది. మరీ ముఖ్యంగా అపూర్వ, త్రిగుణ్ మధ్య మాటల యుద్ధం ఎక్కువగా అయినట్టు కనిపిస్తోంది. మధ్యలో ముఖేష్, వర్షిణిల పేర్లను కూడా అపూర్వ తీసినట్టు అనిపిస్తోంది. మొత్తానికి ఐదో వారం నామినేషన్స్ కూడా హోరాహోరీగానే జరిగినట్లు తెలుస్తోందిబిగ్ బాస్ 10 తెలుగు సీజన్ అయిదో వారంలో త్రిగుణ్, అమన్, రోహిత్, శాలిని, అపూర్వ, రాంప్రసాద్, చరణ్ నామినేట్ అయ్యారని సమాచారం. ఇదిలాఉటే ఈ వారం హౌస్ లో డబుల్ ఎలిమినేషన్ పక్కాగా ఉంటుందని టాక్. ఎందుకంటే



టాలీవుడ్ మోస్ట్ లవబుల్ జంటలలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంట ఒకటి. ప్రస్తుతం వీరిద్దరు జంటగా నటిస్తున్న సినిమా రణబాలి. ఈ మూవీ ప్రమోషన్లలో భాగంగా ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న వీరిద్దరు తమ ప్రేమ, పెళ్లి గురించి, అలాగే రణబాలి సినిమా విశేషాలు, వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన వివాహ ఆలోచనల గురించి మాట్లాడుతూ, విజయ్ దేవరకొండ తనకు రెండు విభిన్నమైన వ్యక్తిత్వాలున్నాయని సరదాగా వెల్లడించారు.ఒక వైపు, ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా, బీచ్ ఒడ్డున షార్ట్స్‌తో చాలా సింపుల్ గా పెళ్లి చేసుకోవాలని అనుకున్నారట. "చాలా సింపుల్ గా చేసుకుందాం" అని తన మొదటి ఆలోచనను పంచుకున్నారు. అయితే ఈ ఆలోచన తన తల్లికి నచ్చలేదని.. పది రోజులు ఏడ్చిందని అన్నారు పెద్ద కొడుకు పెళ్లి ఇట్లా చేస్తే ఎలా అని గొడవ చేసిందని సరదాగా చెప్పారు. దీంతో ఇలా కాదు కింగ్ లా దిగాలని ఒంటిపై బంగారం వేసుకుని పెళ్లి చేసుకున్నానని చెప్పుకొచ్చారు విజయ్.

ఒక వైపు, ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా, బీచ్ ఒడ్డున షార్ట్స్‌తో చాలా సింపుల్ గా పెళ్లి చేసుకోవాలని అనుకున్నారట. "చాలా సింపుల్ గా చేసుకుందాం" అని తన మొదటి ఆలోచనను పంచుకున్నారు. అయితే ఈ ఆలోచన తన తల్లికి నచ్చలేదని.. పది రోజులు ఏడ్చిందని అన్నారు పెద్ద కొడుకు పెళ్లి ఇట్లా చేస్తే ఎలా అని గొడవ చేసిందని సరదాగా చెప్పారు. దీంతో ఇలా కాదు కింగ్ లా దిగాలని ఒంటిపై బంగారం వేసుకుని పెళ్లి చేసుకున్నానని చెప్పుకొచ్చారు విజయ్.రష్మిక మందన్న వివాహ వేడుకలకు తన విధానాన్ని వివరించారు. పెళ్లి ఏర్పాట్లు, బాధ్యతలను ఇతరులకు అప్పగించి, ఆ మూడు రోజులు తాను పూర్తిగా వేడుకను ఆస్వాదించాలనుకుంటున్నానని తెలిపారు. "ఆ త్రీ డేస్ పెళ్లి త్రీ డేస్ నాకు అసలు ఎంజాయ్ చేయాలి" అని ఆమె రణబాలి చిత్రయూనిట్ ను అడిగినట్లు తెలిపారు. వేడుక ముందు, తర్వాత అన్ని బాధ్యతలను నిర్వర్తిస్తానని, కానీ పెళ్లి రోజులు మాత్రం స్వేచ్ఛగా ఉండాలనుకున్నాని అన్నారు. రష్మిక మందన్న వివాహ వేడుకలకు తన విధానాన్ని వివరించారు. పెళ్లి ఏర్పాట్లు, బాధ్యతలను ఇతరులకు అప్పగించి, ఆ మూడు రోజులు తాను పూర్తిగా వేడుకను ఆస్వాదించాలనుకుంటున్నానని తెలిపారు. "ఆ త్రీ డేస్ పెళ్లి త్రీ డేస్ నాకు అసలు ఎంజాయ్ చేయాలి" అని ఆమె రణబాలి చిత్రయూనిట్ ను అడిగినట్లు తెలిపారు. వేడుక ముందు, తర్వాత అన్ని బాధ్యతలను నిర్వర్తిస్తానని, కానీ పెళ్లి రోజులు మాత్రం స్వేచ్ఛగా ఉండాలనుకున్నాని అన్నారు. వంట విషయానికి వస్తే, రష్మిక ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు, ముఖ్యంగా పాన్‌కేక్‌లు బాగా చేస్తారని విజయ్ చెప్పారు. అయితే, ఆమె వంట చేసేటప్పుడు వంటగదిని చాలా గందరగోళంగా మారుస్తుందని సరదాగా అన్నారు. "కిచెన్ షెల్ఫ్ కి మేడమ్ అక్కడ కుకింగ్ చేసిందంటే అక్కడ ఏదో వార్ జరిగినట్టు ఉంటది" అని విజయ్ వివరించారు. రష్మిక పాన్‌కేక్‌లను విజయ్ తల్లి, తండ్రి కూడా ఎంతగానో ఇష్టపడతారని, తరచుగా ఆమెను చేయమని అడుగుతుంటారని తెలిపారు.

సింపుల్‌గా బీచ్‌లో షార్ట్స్ వేసుకుని పెళ్లి చేసుకుందామనుకున్నా

Edited,Printed,Published and Owend by CHITELA KRISHANA ,Printed at sravanthi prienters ,
rtc crss road ,Hyderabad-500001. Published at:4-80/1, VIKARABAD, Telangana.